www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | మంగళ వారం, 20 సెప్టెంబర్ 2022 | ఎడిటర్ : గోనుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-154 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## తెలుగు రాష్ట్రాల్లో
# ఎన్ఐఏ దాడుల కలకలం
### 40 చోట్ల విస్తృత తనిఖీలు

నలుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు

26మందిపై కేసులు నమోదు



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** తెలుగు రా ష్ట్రాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ సోదాలు కలకలం రేపాయి. ఉగ్రవాదులను ప్రోత్సహించడం ద్వారా దాడులకు తెగబడే అనుమానాలతో తనిఖీలు చేపట్టారు. పాపులర్ ఫ్రంట్ఆఫ్ ఇండియా కేసులో.. తెలుగు రాష్ట్రాల్లో 40 చోట్ల అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఉగ్రమూలాలు ఉన్నాయనే కోణంలో దేశవ్యాప్తంగా పీఎఫ్ఐ శిక్షణా కార్యక్రమాలపై నిఘా పెట్టిన అధికారులు.. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో 26 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.రెండు రాష్ట్రాల్లోవిస్తృత తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రంలో 38 చోట్ల సోదాలు చేశారు. హైదరాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. హైదరాబాద్‌లోని నాలుగు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. సూరారం సాయిబాబా నగర్‌లోని జమియా తలిముల్ఇస్లాం మదరసాలో

3వ

## కేరళలో కొనసాగుతున్న రాహుల్ యాత్ర



అలప్పుజలో మత్స్యకారులతో చర్చ

**తిరువనంతపురం, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కేరళలో కోనసాగుతోంది. పన్నెండో రోజు అలప్పుజాలోని పున్నప్ర ప్రాంతంలో యాత్ర ప్రారంభమైంది. యాత్ర ప్రారంభించేందుకు ముందు స్థానికంగా ఉన్న మత్స్యకారులతో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఇంధన ధరల పెరుగుదల, చేపలు నిల్వచేసే టెక్నాలజీ, విద్యాహక్కు ఇంకా దేశంలో పెద్ద సవాళ్లుగా మిగిలిపోయాయన్నారు. మొత్తం 19 రోజులపాటు కేరళలో జోడో యాత్ర జరగనుంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రాహుల్ యాత్ర

3వ

## తెలంగాణలో వైభవంగా బతుకమ్మ సంబరాలు



25 నుంచి 3 వరకు ఉత్సవాల నిర్వహణ● భారీగా ఏర్పాట్లు చేయాలని సిఎస్ ఆదేశాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్నాయి.

3వ

## చేనేత సంక్షేమానికి కృషి చేస్తా

జౌళి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రవీణ్ బాధ్యతలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలంగాణ మరమగ్గాల, జౌళి అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ గూడూరి ప్రవీణ్ అన్నారు. రాష్ట్ర మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో ఆయన మరమగ్గాల, జౌళి అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో మరమగ్గాలు, జౌళి పరిశ్రమల సమగ్రాభివృద్ధి

3వ



## కార్గిల్‌ను వణికించిన భూకంపం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** కేంద్ర పాలిత ప్రాంతమైన లడఖ్‌లోని కార్గిల్‌ను భూకంపం వణికించింది. సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో రిక్టర్ స్కేల్‌పై 4.3 తీవ్రతో ప్రకంపనలు వచ్చినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. కార్గిల్‌కు 64 కిలోమీటర్ల దూరంలో, భూమికి పది కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గుర్తించినట్లు పేర్కొంది. అయితే, భూకంపం కారణంగా ఎలాంటి నష్టం జరిగినట్లుగా నివేదికలు అందలేదని అధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల కిందట లేహ్‌లో భూకంపం సంభవించింది. గత నెలలో జమ్మూ ప్రాంతంలోని దోడా, రియాసి, కిష్త్వార్, ఉధంపూర్ జిల్లాల్లో 13సార్లు భూకంపాలు నమోదయ్యాయి.

## మునుగోడు ఉపఎన్నిక ప్రచారానికి రాను : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
## ప్రచారానికి రాకపోతే కాంగ్రెస్ పార్టీని విడిచి వెళ్ళాలంటూ కార్యకర్తల డిమాండ్

ఒకరు స్వలాభం కోసం పార్టీ మారి కాకమ్మ కథలు చెబుతారు. మరొకరు బువ్వపెట్టిన పార్టీని కాదని వెర్రి వేషాలు వేస్తున్నరు. అసలు వీళ్ల బిత్తిరి వ్యవహారం చూసి జనం జుట్టుపీక్కుంటున్నారు. వీరు చేయాలనుకునేది ఏంటో.. చెప్పాలనుకునేది ఏందో వీరికే క్లారిటీ ఉండదు. నల్లగొండ జిల్లాలో కోమటిరెడ్డి బ్రదర్స్ వ్యవహారం చూసి ముక్కున వేలేసుకుంటున్నరు తెలంగాణ ప్రజలు.

**మీ రాజకీయ భవిష్యత్తుకు పుట్టగతులు ఉంటాయా!**


ఎంత తమ్ముడైతే మాత్రం కాంగ్రెస్ పార్టీ కొంకులు నరుకుతావా వెంకట్‌రెడ్డి. విలువలతో కూడిన రాజకీయం చేస్తే పుట్టగతులుంటయ్. గింత దిగజారిన రాజకీయాలు చేస్తే ఎట్లా !. ఓ దిక్కు మీ తమ్ముడు అమ్ముడు పోయినాడని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల శాపనార్ధాలు మోస్తు ఒడు. రాకాసి పుండుపై కారం చల్లినట్లు కాంగ్రెస్ పార్టీపై, నాయకులపై నీవు విమర్శిస్తున్న తీరు చూసి మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రాజగోపాల్‌రెడ్డిని ఓడించాలని కసితో ఉన్నరు.



**కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ప్రజల నుంచి ప్రశ్నల వర్షం**

- అదిష్టానం నియమించిన అధ్యక్షుడు ఇష్టం ఉండదు కాని నియమించిన సోనియమ్మ అంటే గౌరవం అంటే ఎలా నమ్మేది.
- నిన్న వచ్చిన రేవంత్ కింద పని చేయటం ఇష్టం లేదట. మరి ఎప్పటి నుంచో మునుగోడులో కష్టపడి పని చేసిన బీజేపీ మునుగోడు ఇంచార్జ్ గంగిడి మనోహర్‌రెడ్డి కూడా నీలా ఆలోచిస్తే పరిస్థితి ఏంటి ? గోపాల్.
- కేసీఆర్ తెలంగాణను ముంచుతున్నాడు అని ప్రగల్భాలు పలుకుతున్నారు కాదా ! గుజరాతీలకు మోకరిల్లేందుకు సిద్ధమౌతున్న మీరు తెలంగాణకు ద్రోహం చేసిన వారు అవుతున్నారని గుర్తెరగాలి.
- అభివృద్ధి పేరిట కేంద్రం నుంచి వివిధ కాంట్రాక్టులను ఎం.పీ వెంకట్‌రెడ్డి తెచ్చుకొని కమీషన్‌లు మూటకట్టుకుంటున్నాడు ఇది నిజం కాదా !.

## కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోవర్టు రాజకీయాలతో
# గోపాల్‌కు భారీ ఎఫెక్ట్



**రాజగోపాల్ పై సోషల్ మీడియాలో ట్రోల్స్**

మునుగోడు ఉప ఎన్నికలో కేసీఆర్ పోటీ చేయాలని డిమాండ్ చేయడం సోచనీయం అని, రాజగోపాల్‌రెడ్డి సోయుండి మాట్లాడే మాటలు కావని, తన మానసిక పరిస్థితిపై అనుమానాలు ఉన్నాయని సోషల్‌మీడియాలో రాజగోపాల్‌రెడ్డి మీద మీమ్స్, ట్రోల్స్ చేస్తున్నరు ప్రజలు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమసమాజం):**

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మునుగోడు ఉపఎన్నిక ప్రచారానికి రాను అంటూ క్లారిటీ ఇచ్చిన సంగతి తెలిసిందే. మునుగోడు ఉపఎన్నిక కాంగ్రెస్ పార్టీ గెలుపు కంటే మానవ సంబంధాలే ముఖ్యమని చెప్పుకొచ్చిన సంగతి మనందరికి తెలిసిందే అయితే ఈ నిర్ణయంతో ఇప్పటికే హై కమాండ్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని స్టార్ క్యాంపెనియర్ పదవి నుంచి తప్పించింది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎం.పీగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కొనసాగుతున్నారు. వెంకట్‌రెడ్డి వ్యవహారశైలిని చూసి కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీని కించపరిచే విధంగా మాట్లాడితే ఎం.పి పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్ళిపోవాలని యావత్ కాంగ్రెస్ కార్యకర్తలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. లోలోపల బీజేపీ పార్టీతో కుమ్మకై, పైకి మాత్రమే కాంగ్రెస్ పార్టీపై మొసలి కన్నీరు కార్చుతున్నారని ఆగ్రహిస్తున్నారు కార్యకర్తలు..

ఇదిలా ఉంటే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మునుగోడు ఉపఎన్నిక ప్రచారానికి రాకుండా కాంగ్రెస్‌కు షాకివ్వాలని చూస్తే రాజగోపాల్ రెడ్డికి భారీ ఎఫెక్ట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎత్తులు వేస్తున్నారు. గతంలో కార్యకర్తలకు ఫోన్ చేసి మా తమ్ముడిని గెలిపించాలని కోవర్టు రాజకీయాలు చేయడం చూసి బిత్తరపోయిన కార్యకర్తలు, రాజగోపాల్ రెడ్డిని ఓడించడానికి కఠినమైన నిర్ణయాలు తీసుకుంటామని చెబుతున్నారు. శత్రువుకు శత్రువు టీఆర్ఎస్‌కు మిత్రువుగా మారే అవకాశం ఉంది. మునుగోడు ఉపఎన్నిక పోలింగ్ సమయానికి కాంగ్రెస్ బలాన్ని అంచనా వేసి బీజేపీని ఓడించేందుకు వారి ఓటును గెలిచే పార్టీకి ఓటు వేస్తామని, ఎట్టిపరిస్థితులలో బీజేపీ గెలువనిబోమని చెబుతున్నారు. ఇదే కనుక జరిగితే రాజ గోపాల్‌రెడ్డి రాజకీయ జీవితం అంతమైయ్యే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే బీజేపీ మూడవస్థానానికి పడిపోయిందని సర్వేలు తేల్చేశాయి. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అసమ్మతి పరోక్షంగా రాజగోపాల్‌రెడ్డి కొంప ముంచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదే గనుక జరిగితే టీఆర్ఎస్ భారీ విజయం ఖాయం.

## ఎలిజబెత్ అంత్యక్రియల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**లండన్, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** బ్రిటన్ రాణి ఎలిజబెత్ అంత్యక్రియలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు. బకింగ్ హామ్ ప్యాలెస్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన ముర్ము.. కింగ్ ఛార్లెస్ 3ను కలుసుకున్నారు. అనంతరం లాన్‌కాస్టర్ హౌజ్‌లోని నివాళి పుస్తకంలో ద్రౌపది సంతకం చేశారు. ఆ తర్వాత వెస్ట్ మినిస్టర్ హాల్‌లోని క్వీన్ ఎలిజబెత్ పార్ధీవ దేహానికి ముర్ము శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్రపతి ముర్ము క్వీన్ ఎలిజబెత్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు శనివారం లండన్ చేరుకున్నారు. క్వీన్‌కు తుది వీడ్కోలు పలికేందుకు

3వ

## మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ

నందిగ్రామ్ సహకార ఎన్నికల్లో బిజెపి వ్యయం



**కోల్‌కతా, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నందిగ్రామ్‌లోని ఓ సహకార సంఘానికి జరిగిన ఎన్నికల్లో మమతాబెనర్జి నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. సహకార సంఘంలోని మొత్తం 12 స్థానాలకుగాను టీఎంసీ కేవలం ఒక్క స్థానాన్ని మాత్రమే దక్కించుకుంది. మిగతా 11 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. నందిగ్రామ్‌లోని బెకూటియా సమబాయ్ కృషి సమితి అనే సహకార సంఘానికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తృణమూల్ ఊహించని రీతిలో ఓటమి పాలైంది. గతంలో బెకూటియా సమబాయ్ కృషి సమితి టీఎంసీ కంచుకోటగా ఉండేది. ఇప్పుడు బీజేపీ ఆ కోఆపరేటివ్ బాడీని సొంతం చేసుకుంది. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా నందిగ్రామ్ నియోజకవర్గంలో మమతాబెనర్జి ఘోర పరాజయం మూటగట్టుకుంది. అయితే, గత నెలలో జరిగిన సహకార ఎన్నికల్లో తృణమూల్ జయకేతనం ఎగురవేసింది. నందిగ్రామ్ రెండో బ్లాక్‌లో తృణమూల్‌కు 51 స్థానాలు దక్కగా, సీపీఎం ఒక స్థానాన్ని గెలుచుకుంది. అదేవిధంగా హనుభూనియా, గోల్‌పుకూర్, బిరూలియా సహకార సంఘాలకు జరిగిన ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించింది. పై ఏ ఒక్క సహకార సంఘంలోనూ బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కలేదు.

## సంపాదకీయం

# రాష్ట్రాలపై కేంద్రం కర్రపెత్తనం పోవాలి !

రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీయడం..వారు పథకాలను సక్రమంగా అమలు చేయలేక పోవడం...అప్పులను బూచిగా చూపి దెబ్బతీయడం వంటి ప్రణాళికలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మోడీ అధికారంలోకి వచ్చాక కేంద్ర రాష్ట్రాల మధ్య సఖ్యత దెబ్బతినడానికి ఇదే కారణం. రాష్ట్రాల ఆదాయ వన రులను దెబ్బతీయడమే గాకుండా నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు రావాల్సిన మొత్తాలను జిఎస్టీ ద్వారా అందడం లేదు. ప్రధానంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులకు సంబంధించి కూడా అన్యాయమే జరుగుతోంది. మొత్తం పన్నుల్లో 42శాతం నిధులను రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సి ఉండగా గడిచిన ఆరు సంవత్సరాల్లో 37 శాతం నిధులనే పంపిణీ చేసింది. దీనిలో రాష్ట్రానికి వచ్చింది నామమాత్రమే ! అదే సమయంలో అనేక కేంద్ర ప్రాయోజిత పథకాలను రద్దు చేసింది. పన్నుల వాటా నిధులను సక్రమంగా విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినా ఫలితం కనిపించడంలేదు.దీంతో అనేక రాష్ట్రాల్లో అప్పులపైనే భారం వేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలే నిదర్శనం. అలాగే అనేక కార్యక్రమాల్లో తలదూరుస్తోంది. ఇకపోతే కేంద్రానికి మించి అన్నచందంగా రాష్ట్రాలు కూడా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేస్తూ పోతున్నాయి. అప్పులు చేస్తూ సంక్షేమం పేరిట ఆర్థికస్థితిని దివాళా తీయి స్తున్నాయి. ఇకపోతే ఇటీవల సంక్షోభాలకు మోడీ ఆజ్యం పోస్తోంది. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నిధులకు కూడా మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డుతోంది. విభజన హామీలతో పాటు, అనేకపథకాల అమలుకు సంబంధించిన నిధులు కూడా కేంద్రం సక్రమంగా ఇవ్వడం లేదు. ఇరు రాష్ట్రాల సిఎంలు వైఎస్, జగన్, కెసిఆర్‌లఉ పదేపదే దీనిపై ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. అయితే చెవిటివాడి ముందు శంకం ఊదినట్లుగా ఉంది. అనేక రంగాలకు రావాల్సిన నిధులకు భారీగా కోతలు పడుతున్నాయి. రుణాలు తెచ్చుకోవడానికి కూడా కేంద్రం అనుమతి ఇవ్వడంలేదు. దీంతో రాష్ట్రాల ప్రగతి కుంటుపడు తోంది. అదే సమయంలో అప్పులు తెచ్చుకున్నా ఉదార పథకాలకు పందేరం చేస్తున్నారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. అప్పులు చేసిన డబ్బులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఆర్థికస్థితి బలంగా ఉందని ఉభయ తెలుగురాష్ట్రాల సిఎంలు నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. నిజానికి అప్పులతో రాష్ట్రాలు కుదేలవుతున్నాయి. మరోవైపు రాష్ట్రాలకి ఎంతో చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వ ప్రచారం చేసు కుంటున్నది. ఏమి చేశారో వివరాలు చెప్పడం లేదు. ఎపిలో కీలకమైన రెవెన్యూ లోటు అంశం ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉండిపోయింది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత 2014-15లో ఎపి రాష్ట్ర లోటు రూ.16వేల కోట్లుగా ఉన్నట్లు కాగ్ తేల్చింది. ఈ వివరాలను రాష్ట్ర అధికారులు కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లారు. అయితే, వీటిని మోడీ సర్కారు పట్టించు కోలేదు. అలాగే తొలి ఐదేళ్ల కాలానికి సంబంధించి కూడా లోటు వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర అధికారులు కేంద్రానికి సమర్పించారు. మరోసారి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ ఆ నిధులను త్వరగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవా లని అభ్యర్థించారు. పోలవరం అంచనాలపై పదేపదే చెబుతూ నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ క్రమంలో కేంద్రం నుంచి నిధులు తగ్గిపోగా, కనీసం అప్పులు తెచ్చుకోవడంలో కూడా స్వేచ్ఛ లేకుండా పోయింది.ఇదే సమయంలో ప్రభుత్వ గ్యారంటీలతో ఇచ్చిన రుణాలను కూడా మొత్తం రుణ పరిమితిలో చూపించడం వల్ల తొలి త్రైమాసికంలోనే రుణ పరిమితిని దాటిపోయినట్టయింది. మరో అరశాతం రుణం కోసం విద్యుత్, వ్యవసాయరంగాల్లో సంస్కర ణలు అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోంది. అమరావతి రాజధాని నిర్మాణ బాధ్యత తమదే నని చెప్పుకున్న కేంద్రం కేవలం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంది. తరువాత కాలం లో వందల కొద్దీ వినతులు సమర్పించుకున్నా కూడా కేంద్ర పెద్దలు పట్టించుకోవడమే మానేసారు. రాష్ట్ర పథకాలకు కేంద్రం అందించే నిధుల్లో కూడా కోతలు పెరుగు తున్నట్లు ఆర్థికశాఖ చెబుతోంది. మోడల్ స్కూల్స్, పోలీస్ మోడర్నైజేషన్ స్కీమ్, మెగా ఫుడ్ ప్రాసెసిరగ్ యూనిట్లు, ఇతర నీటిపారుదల, రహదారుల నిర్మాణంవంటి పథకాలకు నిధులు తగ్గినట్లు ఆర్థికశాఖ చెబు తోంది. రాష్ట్ర విభజన సమయంలో ఏడు వెనుకబడిన జిల్లాలకు ఆర్థికసాయం చేస్తామని చెప్పిన కేంద్రం మూడేళ్లకే చేతులెత్తేసింది. ఒక్కో జిల్లాకు ఏటా 50 కోట్లు చొప్పున ఇవ్వాల్సి ఉండగా, మొత్తం రూ.1,050 కోట్లు ఇచ్చిన తరువాత దాని ఊసే విస్మరించింది. రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు..ఈ రెంటిని అనుసంధానిస్తూ ముందుకు సాగాలి. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసం లోకి తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తూనే ఉన్నాయి. నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసా గించాలి. రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. ఇదే సందర్భంలో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షిం చుకునే అవకాశాలు ఉండాలి. కనీసం ఒక్కో రాష్ట్రానికి ప్రధాని నెలలో ఒక రోజయినా సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు చర్చించాలి. నీతి ఆయోగ్ సమావేశా లను కూడా కనీసం మూడు నెలలకో మారయినా సమావేశ పరచి చర్చిస్తే మంచిది. ధాన్యం సేకరణ, నదీజలాల కేటాయింపు సమస్యలు, విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనిం చాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. పాలనాపరమైన విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. అప్పుడే దేశ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా ప్రణాళికలు రూపొందించే అవకాశం ఏర్పడుతుంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# జూబ్లీహిల్స్‌లో మహిళ హత్యకేసులో ట్విస్ట్



### ఎమ్మెల్యే అనుచరుడి ఘాతుకమని బంధువుల ఆరోపణ
### మాజీ డిప్యూటి మేయర్ ఫసియుద్దీన్ పనేనన్న విజయ సింహా
### తక్షణం చర్యతీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్ ముందు బిజెపి ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం): జూబ్లీహిల్స్‌లో మహిళ గొంత కోసిన ఘటన పొలిటికల్ టర్నింగ్ తీసుకుంటోంది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పీఏ విజయ్ ఈ దారుణానికి ఒడిగట్టారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే పీఏ కావటంతో కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని అంటున్నారు. మరోవైపు తనపై వస్తున్న ఆరోపణలను..బోరబండ టీఆర్ఎస్ డివిజనల్ కోఆర్డినేటర్ విజయ్ సింహ ఖండించారు. మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసీయొద్దీన్ కుట్రపూరితంగా ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. ఫసీయుద్దీన్ దగ్గర తాను గతంలో ఉన్నానని, కానీ అతని మోసాలు తెలిసినప్పటి నుంచి దూరంగా ఉంటున్నట్లుగా తెలిపాడు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండటం, తన ఎదుగుదల చూడలేక ఫసీయొద్దీన్ కుట్రతోనే ఇదంతా చేశాడని విజయ్ సింహ చెప్పారు. అత్యాచారాలు చేసే వ్యక్తులు ఫసీయొద్దీన్ దగ్గరే ఉన్నారని ఆరోపించారు. తాను ఏ ఎమ్మెల్యేకు పీఏను కాదని.. టీఆర్ఎస్ కార్యకర్తనని చెప్పుకొచ్చారు. పోలీస్ దర్యాప్తులో తాను తప్పు చేసినట్లు తేలితే జైలుకు వెళ్ళడానికి రెడీ అన్నారు. లేకపోతే రాజీనామా చేయడానికి సిద్ధమా అని ఫసీయుద్దీన్‌కు సవాల్ విసిరారు. బాధిత మహిళ తనకు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమని వెల్లడించారు. వారం రోజుల కింద ఆమె భర్త సూరజ్ తనని కలిసి, తనపై ట్రాప్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పినట్లు విజయ్ తెలిపారు. తన దగ్గర అన్ని అధారాలున్నాయని, విచారణలో నిజానిజాలు తేలుతాయని విజయ్ స్పష్టం చేశారు. ఇదిలావుంటే హైదరాబాద్ నగరంలోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ ముట్టడికి బీజేపీ యత్నించింది. టీఆర్ఎస్ బోరబండ డివిజన్ కో-ఆర్డినేటర్ విజయ్‌సింహ చేతిలో దాడికి గురైన మహిళకు వెంటనే న్యాయం జరగాలంటూ ఆందోళనకు దిగారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బీజేపీ నేతలను చెదరగొట్టారు. వారిని అరెస్ట్ చేసిన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత పల్లపు గోవర్ధన్ మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పీఏ అంటూ చెప్పుకుంటున్న వ్యక్తి నిషా అనే మహిళపై దాడి చేశారని తెలిపారు. ఘటన జరిగిన విషయం పోలీసు దృష్టికి వచ్చిన ఎందుకు ఇప్పటి వరకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. టీఆర్ఎస్ నాయకులు దాడులు చేస్తే కేసులు ఉండవా అంటూ నిలదీశారు. శ్రీరాముడి శోభ యాత్ర చేస్తే తమపై కేసులు పెట్టారని మండిపడ్డారు. మహిళలపై టీఆర్ఎస్ నాయకులు దాడి చేసినా కేసులు ఉండవని అసెంబ్లీలో ఓ జీవో పాస్ చేయండంటూ యెద్దేవా చేశారు. యాక్షన్ తీసుకునేంతవరకు బీజేపీ నిరసనలు కొనసాగుతూనే ఉంటాయని పల్లపు గోవర్ధన్ స్పష్టం చేశారు.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఇడి దూకుడు

### బిల్డర్ శ్రీనివాసరావు ఇంట్లో విస్తృతంగా సోదాలు
### శ్రీనివాసరావును అదవుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం): ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరింత దూకుడు పెంచింది. ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్‌లోని 5 ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు చేశారు. కరీంనగర్‌కు చెందిన బిల్డర్ శ్రీనివాసరావు ఇంట్లో సోదాలు ముగిశాయి. అతను అధికార పార్టీ నేతకు దూరపు బంధువుగా తెలుస్తోంది. అనంతరం బిల్డర్ శ్రీనివాసరావును అదుపులోకి ఈడీ కార్యాలయానికి తరలించారు. శుక్రవారం దేశంలోని వివిధ ప్రాంతాల్లో మరోసారి మెరుపు దాడులు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 40 చోట్ల ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 25 ప్రత్యేక బృందాలుగా హైదరాబాద్ కు వచ్చిన ఈడీ అధికారులు.. ఉదయం నుంచే నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఏకకాలంలో పలు సంస్థల కార్యాలయాలు, పలువురి నివాసాల్లో తనిఖీలు చేపట్టారు. సీఎం కేసీఆర్ కుమార్తె, టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఆడిటర్‌గా వ్యవహరిస్తున్న గోరంట్ల బుచ్చిబాబు కార్యాలయంలోనూ ఈడీ ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. బుచ్చిబాబు దోమల్‌గూడలోని శ్రీ సాయికృష్ణ రెసిడెన్సీలో గోరంట్ల అసోసియేట్స్ పేరుతో సంస్థను నిర్వహిస్తున్నారు. కవితకు 2009 నుంచి వ్యక్తిగత



# మునుగోడు కోసమే గిరిజన రిజర్వేషన్ల డ్రామా

### ఎనిమిదేళ్లుగా ఎందుకు అమలు చేయలేదు
### రాష్ట్రానికి హక్కున్నా ఎందుకు పట్టించుకోలేదు
### బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్ విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం): గిరిజనుల రిజర్వేషన్లపై కేసీఆర్ డ్రామాలాడుతున్నారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. ఎనిమిదేళ్లుగా ఎందుకు మిన్నకున్నారని అన్నారు. తాను చేయలేని పనులను కేంద్రంపై నెట్టి విమర్శించడం కెసిఆర్ అలవాటు చేసుకున్నారని మండిపడ్డారు. బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్ల అమలుపై రాష్ట్రాకు స్వేచ్ఛ ఉందని అన్నారు. రాష్ట్రంలో అమలయ్యే జీవోలన్నింటికి కేంద్రం ఆమోదం ఉందా అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ హయాంలో ఒక్క జీవోతో రిజర్వేషన్లు పెంచారని లక్ష్మణ్ అన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు జీవో తోనే అమలైతే 8 ఏళ్ల నుంచి జీవో ఎందుకు ఇవ్వలేదని కేసీఆర్‌ని లక్ష్మణ్ ప్రశ్నించారు. మునుగోడు ఎన్నికలు వస్తున్నాయనే గిరిజన రిజర్వేషన్ల అంశాన్ని కేసీఆర్ తెరపైకి తెచ్చారని, వారిని మోసం చేసేందుకు రిజర్వేషన్ల నాటకమని లక్ష్మణ్ తెలిపారు. రిజర్వేషన్లను పెంచడమే కాకుండా దానిని అమలు చేయాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే అని వెల్లడించారు. లేకపోతే దీనిపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కేసీఆర్, కాంగ్రెస్ ఒక్కటేనని, ఎన్ని అవినీతి పార్టీలు ఏకమైన ప్రజలు మోడీ వైపునే ఉన్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ ఎన్ని బంధులు తీసుకువచ్చిన రాష్ట్రంలో టీఆర్ఎస్ బంద్ కావడం ఖాయమని లక్ష్మణ్ తెలిపారు.



బిజెపి భరోసా యాత్రలో వివేక్

# కెసిఆర్‌ను మించిన అబద్దాలకోరు లేరు

జయశంకర్ భూపాల్‌పల్లి, సెప్టెంబర్ 19 (సమ సమాజం): ప్రజలకు ఇచ్చిన హామీలు మర్చిపోతున్న సీఎం కేసీఆర్ ను మించిన అబద్దాలకోరు మరొకరు లేరని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి విమర్శించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఏమయ్యాయో బదులివ్వాలని కేసీఆర్ ను ప్రశ్నించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో ప్రారంభమైన 'ప్రజా గోస, బీజేపీ భరోసా యాత్ర'లో వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగాపురం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన ఆయన.. కాళేశ్వరం ప్రాజెక్టును కట్టడం వల్ల విలువైన ప్రజా సంపద ఆవిరైందన్నారు. ఇటీవల వరదలకు కాళేశ్వరం ప్రాజెక్టు పంప్ హౌస్ లు మునిగిపోయినయ్. రాష్ట్రానికి ఎంతో నష్టం జరిగిందని వివేక్ వెంకటస్వామి గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేస్తున్న అవినీతి సరిపోక.. ఢిల్లీలో కూతురి ద్వారా లిక్కర్ స్కాం కూడా చేయించారని అని ఆరోపించారు. ప్రజల్ని తాగుబోతులుగా మార్చి.. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే లక్ష్యంగా కేసీఆర్ సర్కారు పనిచేస్తోందన్నారు. ఎన్నికలకు ముందు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టిస్తనని హామీ ఇచ్చిన కేసీఆర్.. ఎన్నికల తర్వాత కొడుకును ఎలా సీఎం చేయాలనే దానిపై దృష్టిపెడుతున్నాడని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. నిజామాబాద్ ఎన్నికలో ఓడిపోయిన కూతురు కవితను..ఎమ్మెల్సీగా చేసుకొని శాసన మండలికి కేసీఆర్ పంపారని గుర్తుచేశారు. ఎన్నికలప్పుడు టీఆర్ఎస్ పార్టీ పంచిపెట్టే డబ్బులకు లొంగొద్దని ప్రజలను ఆయన కోరారు. కాళేశ్వరం నీటిని కూడా కేసీఆర్ ఫామ్ హౌజ్ కే సరఫరా చేసుకుంటున్నారని చెప్పారు.



# మునుగోడులో జోరు పెంచిన కాంగ్రెస్

### ఇంటింటి ప్రచారంలో పాల్వాయి స్రవంతి

నల్లగొండ, సెప్టెంబర్ 19 (సమ సమాజం): మునుగోడు ఉప ఎన్నికల ప్రచారం క్రమంగా వేడెక్కుతోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. సోమవారం చండూరు మండలం గొల్లగూడెం గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా చాలా సాదాసీదాగా ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఓటర్ల కోసం ఇళ్లకు వెళ్లినప్పుడు ఆడపడుచులకు కానుకగా గాజులు, కుంకుమ, బొట్టు పాల్వాయి స్రవంతి సమర్పిస్తున్నారు. హామీల అమలులో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని ఆమె అన్నారు. బీజేపీ,టీఆర్ఎస్‌లు కలిసి రాజకీయ లబ్దికోసం వెంపర్లాడుతున్నాయని, ఆయా పార్టీలకు రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించిన కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుడిని సీఎం చేస్తానని, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తానని, దళితబంధు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తానని హామీ ఇచ్చారని, వాటిని అమలు చేయడం మాత్రం మరిచారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆమె అన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లోని మోదీ, కేసీఆర్ ప్రభుత్వాలను పడగొట్టడమే కాంగ్రెస్ పార్టీ ముందున్న లక్ష్యమన్నారు.

# నల్లగొండలో గర్భిణి మృతి

### వైద్యుల తీరుపై బంధువుల ఆందోళన



నల్లగొండ,సెప్టెంబర్ 19 (సమ సమాజం): నల్గొండ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే అఖిల అనే గర్భిణి ప్రాణాలు కోల్పోయిందంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన వ్యవహారంపై డీఎంఈ రమేష్ రెడ్డి స్పందించారు. నల్గొండ ప్రభుత్వ హాస్పిటల్ లోని వార్డులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఎక్కడా క్లీన్ గా లేకపోవడంతో పాటు వైద్య సేవల్లో నిర్లక్ష్యంపై ఆయన మండిపడ్డారు. డీఎంఈ రాకపై సమాచారం అందడంతో నల్గొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి కూడా ఆస్పత్రికి చేరుకున్నారు. వార్డులను తనిఖీ చేసే క్రమంలో ఎమ్మెల్యే, డీఎంఈని వసతులపై రోగులు, వారి తరఫు బంధువులు నిలదీశారు. ప్రభుత్వ హాస్పిటల్ లో కనీస వసతులు లేవు. మీ కుటుంబంలో ఎవరికైనా జబ్బు చేసి వస్తే ఇలాంటి హాస్పిటల్ లోనే ట్రీట్మెంట్ చేయిస్తరా? అంటూ ప్రశ్నించారు. పరిస్థితిని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే కంచర్ల.. ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చిరాం నాయక్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలు అందించడం చేతకాకపోతే రాజీనామా చేసి వెళ్ళిపో అంటూ మండిపడ్డారు.

# కులవృత్తులకు ప్రాధాన్యం ఇస్తున్న కెసిఆర్

### పెద్దచెరువులో చేపలు వదిలిన మంత్రి సబిత



రంగారెడ్డి, సెప్టెంబర్ 19 (సమ సమాజం): సీఎం కేసీఆర్ అన్ని కులవృత్తులకు ప్రాధాన్యమిస్తూ ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో పరిధి రావిర్యాల పెద్ద చెరువులో మంత్రి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిషన్ కాకతీయతో చెరువుల్లో పూడికతీతతో అవి జలకళ సంతరించుకున్నాయి. గతంలో చేపల కోసం ఆంధ్ర మీద ఆధారపడే వాళ్లం. కానీ నేడు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంతో రాష్ట్రంలో మృత్స్య సంపద పెరిగిందన్నారు. రంగారెడ్డి జిల్లాలో కోటి 60 లక్షల చేప పిల్లలు వదలడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. రావిర్యాల పెద్ద చెరువులో ఒక్క రోజే 5 లక్షల చేప పిల్లలు వదులుతున్నామన్నారు. చేపల మార్కెటింగ్‌కు ఔట్ లెట్లు, ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్ వాహనాలను సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. సరఫరదారుడు తీసుకొచ్చిన చేప పిల్లలను నిశితంగా పరిశీలించి సైజ్, నాణ్యత ప్రభుత్వ నిబంధనల కు అనుగుణంగా ఉన్న చేప పిల్లలను మాత్రమే చెరువుల్లో వదలాలన్నారు. నిబంధనల ప్రకారం లేని చేప పిల్లలను తిరస్కరించాలని మంత్రి సూచించారు.



కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

# టిఆర్ఎస్‌లో పలువురి చేరిక

నల్లగొండ, సెప్టెంబర్ 19 (సమ సమాజం): సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరుతున్నారని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ అన్నారు. టిఆర్ఎస్‌ను ఇంటిపార్టీగా ఆదరిస్తున్నారని అన్నాఉ. మునుగోడులో టిఆర్ఎస్ గెలుపు ఖాయమని అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కందుకూరు గ్రామానికి చెందిన 60కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలను కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల అభ్యున్నతికి టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. రైతులకు నిరంతరం కరెంట్ అందించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో లక్ష 60వేల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం అని ఆయన తెలిపారు. ప్రతి కార్యకర్త కుటుంబానికి గులాబీ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. టీఆర్ఎస్ పార్టీలో రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొంది మృతిచెందిన కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల బీమా చెక్కును అందజేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజినేని వెంకటేశ్వర్ రావు, రైతుబంధు అధ్యక్షుడు సిరందాసు కృష్ణయ్య, యువజన విభాగం మండల అధ్యక్షుడు మాల్ రెడ్డి విష్ణువర్దన్ రెడ్డి, నేనావత్ రాంబాబు, బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, డొద్దుపల్లి సంజీవ, ఉపగంటి అంజల్ రావు, సూరి, వేముల రాజు, బోడ్డుపల్లి కృష్ణ, విష్ణు, వాడిత్య బాలు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో దళితబంధు.. మునుగోడు కోసం గిరిజనబంధు..

### కెసిఆర్ తీరుపై మండిపడ్డ రాజగోపాల్ రెడ్డి



యాదాద్రి, సెప్టెంబర్ 19 (సమ సమాజం): ప్రతిపక్షం లేకుండా చేసి కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన దాదాపు 500 మంది కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. వాంరదరికీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో దళిత బంధు పథకం పెట్టారు, మునుగోడు ఉప ఎన్నికకు గిరిజన బందు పథకం తెస్తున్నారు.1400 యువకుల ఆత్మబలిదానాలతో తెలంగాణ ఏర్పడితే కేసీఆర్ కుటుంబం రాజకీయ పాలన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం మీడియాతో మాట్లాడుతూ... 1400 యువకుల ఆత్మబలిదానాలతో తెలంగాణ వస్తే కేసీఆర్ కుటుంబం రాజకీయ పాలన చేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టల పేరు మీద వేల కోట్ల రూపాయలు కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందన్నారు. మునుగోడు ఉప ఎన్నికను ప్రపంచంలోని ప్రతి తెలుగు వారు గమనిస్తున్నారని తెలిపారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో దళితబంధు పథకం పెట్టారని... మునుగోడు ఉప ఎన్నికకు గిరిజన బందు పథకం తెస్తున్నారంటూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబ పాలన అంతం కావాలంటే మునుగోడు ఉపఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని రాజగోపాల్ రెడ్డి ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్‌ను గద్దె దింపాలంటే ప్రధాని మోడీ, అమిత్ షా లతోనే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టల పేరు మీద వేల కోట్ల రూపాయలు కేసీఆర్ కుటుంబం దోపిడీ చేసిందని ఆరోపించారు. తన రాజీనామా తో ఫామ్ హౌస్‌లో పడుకున్న కేసీఆర్‌ను మునుగోడుకు రప్పించానని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలని ముఖ్యమంత్రి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో జాయిన్ అయ్యానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. తనను రాజకీయంగా ఎదుర్కొలేక టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంగళ వారం, 20. 09. 2022
www.samasamajam.in
సమ సమాజం



# అనాథ బాలికకు అండగా నిలిచిన మంత్రి కెటీఆర్

### ఇంజనీరింగ్ వరకు చదువుకు ఆర్థిక సాయం● వెండి రాఖీ కట్టి ఆత్మీయత చాటిన బాలిక



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** ఆడపిల్లల విద్య విషయంలో అండగా ఉండేందుకు ఎప్పుడు ముందుండే టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తన మంచి మనసుతో నిరుపేద విద్యార్థిని జీవితాన్ని నిలబెట్టారు. తల్లిదండ్రులు లేని రుద్రరచన అనే ఇంజనీరింగ్ విద్యార్థిని చదువుకు అవసరమైన సహాయం చేసి ఆమె ఇంజనీరింగ్ పూర్తి అయ్యేలా చూశారు. అయితే తన ఇంజినీరింగ్ విద్య పూర్తయ్యేందుకు సహకరించిన కేటీఆర్ పట్ల రుద్ర రచన ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. ఆమె చూపిన అభిమానానికి కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. తాను పొదుపు చేసుకున్న డబ్బులతో వెండి రాఖీ తయారు చేయించాన్న రచన, ఆ రాఖీని కేటీఆర్‌కు కట్టింది. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తండ్రియాల గ్రామానికి చెందిన రుద్ర రచన చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయి స్థానిక బాలసదనంలో ఉంటూ జగిత్యాల ప్రభుత్వ బాలికల హైస్కూల్లో 10వ తరగతి వరకు చదివింది. ఆ తర్వాత హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని స్టేట్ హోమ్‌లో ఉంటూ పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసింది. ఈసెట్ ప్రవేశ పరీక్ష ద్వారా హైదరాబాద్ సీబీఐటీ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్‌లో ఇంజనీరింగ్ సీటు సంపాదించింది. అయితే తల్లిదండ్రులు లేని రుద్ర రచన తన ఇంజనీరింగ్ ఫీజులు చెల్లించలేకపోయింది. రుద్ర రచన ఆర్థిక ఇబ్బందులను సామాజిక మాధ్యమాల ద్వారా 2019లో తెలుసుకున్న కేటీఆర్, ఆమెను ప్రగతి భవన్ పిలిపించుకొని ఇంజినీరింగ్ చదువు పూర్తి అయ్యేందుకు అవసరమైన ఖర్చులను భరిస్తానని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రుద్ర రచన ఇంజినీరింగ్ ఫీజులు, హాస్టల్ సంబంధిత ఖర్చులను కేటీఆర్ వ్యక్తిగతంగా భరించారు. కేటీఆర్ ఆర్థిక సహాయంతో ఇంజినీరింగ్ చదువుతున్న రుద్ర రచన, ఇటీవల జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో నాలుగు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాన్ని సాధించింది. ఈ సందర్భంగా ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్‌ను రుద్ర రచన కలిసింది. ఆమె చదువు, ఉద్యోగాల విషయం తెలుసుకుని కేటీఆర్ సంతోషపడ్డారు. తనకంటూ ఎవరూ లేకున్నా ఆత్మ విశ్వాసంతో రుద్ర రచన జీవితంలో విజయం సాధించిందని మెచ్చుకున్నారు. తల్లిదండ్రులు లేని తనకు మంత్రి కేటీఆర్ ఒక అన్నగా అండగా నిలబడ్డారని, తన కల సాకారం కోసం తండ్రిగా తపించారని రచన భావోద్వేగానికి లోనయింది. ఈ సంవత్సరం రాఖీ కట్టాలనుకున్నానని అయితే కేటీఆర్ కాలికి గాయం అయిందన్న విషయం తెలుసుకుని బాధపడ్డానని రుద్ర రచన చెప్పింది. తాను పొదుపు చేసుకున్న డబ్బులతో వెండి రాఖీ తయారు చేయించానన్న రచన, ఆ రాఖీని కేటీఆర్‌కు కట్టింది. రచన మాటలకు, అభిమానానికి మంత్రి కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు. రచన చేత రాఖీ కట్టించుకున్న తాను, ఆమె జీవితంలో మరింత స్థిరపడేందుకు చేసే ప్రతి ప్రయత్నానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జీవితంలో అనేక కష్టాలు ఎదుర్కొని వాటిని సవాలుగా స్వీకరించి నాలుగు కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన రచన యువతరానికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్ పరీక్ష రాసి సివిల్ సర్వెంట్ కావాలన్నా తన లక్ష్యానికి అండగా ఉంటానని కేటీఆర్ హామీ ఇచ్చారు. రచన చివరి సంవత్సరం ఇంజినీరింగ్ ఫీజు, హాస్టల్ బకాయిలను కొరకు అవసరం అయినా మొత్తం నగదు సహాయాన్ని సోమవారం కేటీఆర్ అందించారు.

# 25 నుంచి 3 వరకు బతుకమ్మ పండగ

### అమ్మపల్లి రామాలయంలో జాగృతి వేడుక



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బతుకమ్మ పండుగ వేడుకలు ఈనెల 25 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా 30వ తేదీన రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అమ్మపల్లి గ్రామంలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో బతుకమ్మ పండుగ నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత నిర్ణయించారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా అమెరికన్ కౌన్సిలర్ జనరల్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఆలయాన్ని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో కలిసి సందర్శించారు. బతుకమ్మ వేడుకలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లను ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆదేశించారు.

# తెలంగాణలో వైభవంగా బతుకమ్మ సంబరాలు

(మొదటి పేజీ తరువాయి) బతుకమ్మ సంబురాలను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా వైభవంగా నిర్వహిస్తున్నది. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు బతుకమ్మ వేడుకలకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో నిర్వహణపై బీఆర్‌కే భవన్‌లో సమన్వయ సమావేశం జరిగింది. భేటీలో ప్రభుత్వ సలహాదారు రమణాచారి, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఆయాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఎల్‌బీ స్టేడియం, నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మ లోగోలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి మాట్లాడుతూ హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లాల్లో ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 3న ట్యాంక్‌బండ్ వద్ద సద్దుల బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయన్నారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు. ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. బతుకమ్మ పండుగపై ఆకర్షణీయమైన డిజైన్లతో మెట్రో పిల్లర్లను అలంకరించాలని అధికారులను ఆదేశించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తామని డీజీపీ తెలిపారు.

# బిజెపి అధికారంలోకి రాగానే డంపింగ్ యార్డుతరలింపు

### జవహర్ నగర్ వాసులకు బండి సంజయ్ హామీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దమ్మాయిగూడ జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. డంపింగ్ యార్డ్‌తో ఇక్కడి ప్రజల ఆరోగ్యం చెడిపోతోందని, సమస్య పరిష్కారానికి పాదయాత్ర పూర్తయిన తర్వాత తానే వచ్చి పోరాడుతానని చెప్పారు. టీఆర్ఎస్ నేతలను పట్టుకొచ్చి డంపింగ్ యార్డు వద్ద కట్టేయాలని, అప్పుడే ఈ ప్రాంతంలోని లక్షలాది మంది ప్రజలు పడుతున్న బాధలు వారికి తెలుస్తాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఏ మాత్రం మానవత్వం ఉన్నా జవహర్ నగర్ డంపింగ్ యార్డు వద్ద కొచ్చి.. ఇక్కడి ప్రజల బాధలు తెలుసుకోవాలన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో బండి సంజయ్ 'ప్రజా సంగ్రామ యాత్ర' కొనసాగుతోంది. యాప్రాల్ నుండి దమ్మాయిగూడ వరకూ పాదయాత్ర చేశారు. ఆ తర్వాత దమ్మాయిగూడ చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ అబద్దాల కోరు అని..ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిదేండ్లలో నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎవరికి ఉద్యోగం రాకున్నా..కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కు రూ. లక్ష కోట్లు ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో ప్రయోజనం లేదన్నారు. కాళేశ్వరం నీటిని కేసీఆర్ ఫామ్ హౌస్ కు సరఫరా చేసుకుంటున్నారని మండిపడ్డారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వడంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వారా టీఆర్ఎస్ కు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు.

# ప్రజల భాగస్వామ్యంతో గుణాత్మక అభివృద్ధి

### అభివృద్ధిలో ముందున్న ఏకైక రాష్ట్రం తెలంగాణయే● కేంద్రం తీరు అభివృద్ధికి విఘాతం అన్న హరీష్ రావు



**సిద్దిపేట, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** ప్రజాప్రతినిధుల సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలోని పట్టణాలు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందుతున్నాయని మంత్రి హరీష్ రావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లు. అభివృద్ధితో సమాంతరంగా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనే అని చెప్పుకోవడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. అభాగ్యులకు అండగా నిలవడానికి ప్రభుత్వం ఆసరా పింఛన్లు అందజేస్తున్నదన్నారు. కేంద్రం అనని విధాలుగా సహకరించి ఉంటే తెలంగాణ ఇంకా ఎంతో అభివృద్ధి సాధించేదని ఆయన ఆర్ఎన్ఎ ప్రతినిధితో అన్నారు. దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ఆచరించడంలో గౌరవ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ముందువరుసలో ఉన్నారు. దళిత బంధు కార్యక్రమాన్ని అమలు చేసి జిల్లాలో 495 మంది లబ్దిదారులకు ఒక్కొక్కరికి 10లక్షల రూపాయల చొప్పున సాయం అందజేసి వారి ఆర్థిక సాధికారతకు బాటలు వేశారు. దశలవారీగా జిల్లాలోని అర్హులంద రికీ ఈ పథకం వర్తించేలా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. ఆనాడు తెలంగాణలో సమస్త జనులు ఏకమై చేసిన పోరాట చరిత్రను వక్రీకరిస్తూ, ఆనాటి త్యాగధనుల ఆశయాలకు విరుద్ధంగా మతపిచ్చి మంటలు రేపాలని విచ్ఛిన్నకర శక్తులు కుట్రలు చేస్తున్నాయన్నారు. సిద్దిపేట పట్టణానికి 20కి పైగా జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు రావడం మనమంతా గర్వపడాల్సిన విషయం. హుస్నాబాద్, గజ్వేల్ పట్టణాలకూ జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని హరీష్ రావు ప్రశంసించారు. గుంతల దారులు, మట్టి రోడ్ల స్థానంలో నేడు విశాలమైన తారు రోడ్లు నిర్మించుకున్నామని అన్నారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో గ్రామాలకు, మండలాలకు, జిల్లా కేంద్రానికి అనుసంధానంగా రహదారులు ఉండేలా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆ ఫలితంగానే జిల్లాలో 286 కిలోమీటర్ల రెండు వరుసల రహదారులు నిర్మాణమయ్యాయి. 22 కిలోమీటర్ల నాలుగు వరుసల రహదారి, సిద్దిపేట చుట్టూ 74 కిలోమీటర్ల రింగు రోడ్డు, గజ్వేల్ పట్టణం చుట్టూరా 22 కిలోమీటర్ల రింగు రోడ్డు అందుబాటులోకి రానున్నాయి. అదే విధంగా సిద్దిపేట జిల్లా కేంద్రం మీదుగా మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారి, సిరిసిల్ల-జనగామ జాతీయ రహదారి పనులకు నిధుల కేటాయింపు జరిగిందన్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభం కాబోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి సిద్దిపేట జిల్లాలో 3వేల 700 కిలోమీటర్ల నిడివి గల 795 రహదారులు ఉండగా ప్రస్తుతం 5వేల 376 కిలోమీటర్ల నిడివితో 1 వెయ్యి 18 రోడ్లను అభివృద్ధి చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఒకప్పుడు సిద్దిపేట ప్రాంతానికి పర్యాటక గుర్తింపు లేనేలేదు. వినోదాలు, విహారాల కోసం ఈ జిల్లా వాసులు ఇతర ప్రాంతాలకు వెళ్లడం జరిగేది. కానీ ఇప్పుడు హైదరాబాద్‌తో సహ ఇతర ప్రాంతాల నుండి సిద్దిపేటకు తరలివస్తున్నారు. ఊహించని స్థాయిలో సిద్దిపేట జిల్లా పర్యాటకంగా అభివృద్ధి సాధించింది. కోటిఅందాలతో ముస్తాబైన సిద్దిపేట కోమటిచెరువు, గజ్వేల్‌లోని పాండవుల చెరువు, హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు, దుబ్బాకలోని రామసముద్రం చెరువు, ఐలాండ్‌ను తలపిస్తున్న రంగనాయకసాగర్, కనుచూపుమేర జలసంద్రాలుగా కనువిందు చేస్తున్న మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌లను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఆసక్తి చూపిస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్ పట్టణ శివారుల్లో రూపుదిద్దుకున్న ఆక్సిజన్ పార్కులు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయని కొనియాడారు. జిల్లాలో 1లక్షా 94వేల 917 మందికి ప్రతీనెల 41కోట్ల 40లక్షల రూపాయల పింఛన్ డబ్బులను వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతున్నది. కొత్తగా మరో 26వేల 646 మందిని ఆసరా పింఛన్ల లబ్దిదారులుగా గుర్తించి వారికి సంక్షేమ సాయం అందించడం జరిగింది. నిరుపేద ఆడపిల్లల వివాహాలకు ప్రభుత్వమే భరోసా కల్పిస్తున్నది. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఇప్పటివరకు జిల్లాలో 8వేల 537 మందికి 85కోట్ల 46లక్షల 90వేల రూపాయలు అందించడం జరిగింది. దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను కట్టించి ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. జిల్లాకు 15వేల 826 ఇండ్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు 12వేల 216 ఇండ్ల నిర్మాణం ప్రారంభించడం జరిగింది. ఇందులో 9వేల 253 గృహ నిర్మాణాలు పూర్తి కాగా 4వేల 702 ఇండ్లలో లబ్దిదారులు గృహ ప్రవేశం చేయడం జరిగింది. త్వరలోనే మిగితా అర్హులకు ఇండ్లు పంపిణీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశాము. వచ్చే దసరా నుండి సొంత స్థలం ఉన్నవారికి 3లక్షల రూపాయలను ఇంటి నిర్మాణం కోరకు ప్రభుత్వం తరపున సాయం అందించబోతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

# చేనేత సంక్షేమానికి కృషి చేస్తా

(మొదటి పేజీ తరువాయి) కోసం జౌళీ రంగాల్లో ఆధారపడిన కార్మికులకు నిరంతరం పని కల్పించడంతో పాటు పవర్‌లూం వస్త్రాలకు మార్కెట్ సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ కార్యదర్శి బుద్ధ ప్రకాశ్ జ్యోతి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, నారదాసు లక్ష్మణ్‌రావు, బసవరాజు సారయ్య, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో పాటు రాజన్న సిరిసిల్లకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశంలో స్వల్పంగా తగ్గిన కరోనా కేసులు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** దేశంలో కరోనా కేసులు స్వల్పంగా తగ్గాయి. ఆదివారం 5664 మంది కరోనా బారిన పడగా, సోమవారం కొత్తగా 4858 మందికి కరోనా సోకింది. దీంతో మొత్తం కేసులు 4,45,39,046కు చేరాయి. ఇందులో 4,39,62,664 మంది కోలుకోగా, ఇప్పటివరకు 5,28,355 మంది మరణించారు. మరో 48,046 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు కొత్తగా 4735 మంది కోలుకోగా, 10 మంది మృతిచెందారని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. మొత్తం కేసుల్లో 0.11 శాతం కేసులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయని తెలిపింది. రికవరీ రేటు 98.71 శాతం, మరణాలు 1.19 శాతంగా ఉన్నాయని, రోజువారీ పాజిటివిటీ 2.76 శాతంగా ఉందని ప్రకటించింది.

# తెలుగు రాష్ట్రాల్లో ఎన్ఐఎ దాడుల కలకలం

(మొదటి పేజీ తరువాయి) నిర్వహించారు. కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఓ ఉపాధ్యాయుడిని పీఎఫ్ఐ సభ్యుడిగా గుర్తించి.. అతడి సెల్‌ఫోన్‌స్వాధీనం చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా 23 చోట్ల జల్లెడ పట్టారు. నగరంలోని కంఠేశ్వర్‌కు చెందిన ఓ వ్యక్తిని.. ఈ నెల 19న విచారణకు హాజరుకావాలని నోటీసులు అందించారు. ఎడపల్లి మండలం ఎమ్మెస్సీ ఫారంలో ఓ యువకుడి ఇంట్లో సోదాలు చేపట్టి.. రెండు ఫోన్లనుపాస్‌పోర్టు, బ్యాంకు ఖాతా పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్? జిల్లాలోనూ దాడులు జరిగాయి. ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్ కాలనీలో ఓ ఇంట్లో తనిఖీలు చేపట్టారు. నిజామాబాద్ నుంచి వచ్చి కొంతకాలంగా నివాసం ఉంటున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిర్మల్ జిల్లాలోనూ రెండుచోట్ల విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. భైంసాలోని మదీనా కాలనీలో కొందరి ఇళ్లలో సోదాలు నిర్వహించి పీఎఫ్ఐ సంస్థ శిక్షణ కార్యక్రమాలపై ఆరా తీశారు. జగిత్యాల జిల్లాలో భారీ భద్రత నడుమ ఏడుచోట్ల ఏకకాలంలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. టవర్ సర్కిల్‌లోని కేర్ మెడికల్‌లో తనిఖీలు చేపట్టేందుకు నాలుగు వాహనాల్లో అధికారులు వచ్చారు. దుకాణం తాళాలు పగులకొడుతుండగా మహిళలు అడ్డుకున్నారు. స్థానిక పోలీసుల సహకారంతో యజమానిని పిలిపించి తాళం తెరిపించారు. అనంతరం దుకాణంలోని సీసీ టీవీ దృశ్యాలను పరిశీలించారు. అనుమానితుల ఇళ్లలోనూ తనిఖీలు చేశారు. వారి నుంచి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్‌లోనూ ఓ ప్రాంతంలో సోదాలు నిర్వహించారు. ఉగ్రమూలాలు ఉన్నాయనే ఆధారాలతో సోదాలు చేపట్టడం కలకలం రేపింది. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, కర్నూలు జిల్లాల్లోనూ జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంనకు చెందిన ఇలియాస్.. అతడి మిత్రుల ఇళ్లలో సోదాలు చేశారు. తనిఖీల కోసం వచ్చిన అధికారులను ఇలియాస్ బంధువులు, మిత్రులు అడ్డుకోగా.. పోలీసులు వారికి నచ్చజెప్పారు. ఎన్ఐఏ అధికారులు అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేసి సెల్‌ఫోన్, డైరీ స్వాధీనం చేసుకున్నారు. ఇలియాస్ రెండు నెలలుగా కనిపించడం లేదని కుటుంబసభ్యులు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. నంద్యాలలో సోషల్ డెమాక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా సభ్యుల నివాసాల్లో ఎన్ఐఏ తనిఖీలు నిర్వహించింది. సోదాలకు వ్యతిరేకంగా.. కొందరు ఆందోళనకారులు నినాదాలు చేయగా.. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. పీఎఫ్ఐ కేసులో భాగంగా జరిపిన తనిఖీల్లో పలు కీలక దస్త్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు రూ.8 లక్షల 31 వేలు స్వాధీనం చేసుకున్నామని ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. ఉగ్రవాద కార్యకలాపాలకు క్యాంపులు పెట్టి శిక్షణ ఇవ్వడం, మత కలహాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు గుర్తించారు. నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని ప్రకటించిన అధికారులు.. మరో 26 మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

# మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి) దాదాపు వివిధ దేశాలకు చెందిన 500 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. అమెరికా అధ్యక్షుడు బైడెన్, జపాన్ చక్రవర్తి నరుహితో, చైనా ఉపాధ్యక్షుడు వాంగ్ క్విషాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసోలు అంత్యక్రియల్లో పాల్గొంటారు.

# కేరళలో కొనసాగుతున్న రాహుల్ యాత్ర

(మొదటి పేజీ తరువాయి) ఎర్నాకుళం జిల్లాకు.. 23న త్రిస్సూర్ చేరుకోనుంది. సెప్టెంబర్ 26, 27న పాలక్కడ్, 28న మలప్పురంలో భారత్ జోడో యాత్ర కొనసాగనుంది. కేరళలోని 7 జిల్లాల్లో పాదయాత్ర చేయనున్నారు రాహుల్ గాంధీ. అక్టోబర్ 1న కర్ణాటకలోకి యాత్ర ప్రవేశిస్తుంది.

# సాహితీవేత్త నిజాం వెంకటేశం మృతికి కేసీఆర్ సంతాపం

**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (సమ సమాజం):** సాహితీ సృజనకారుల ఆత్మబంధువు, సాహితీవేత్త, నిజాం వెంకటేశం మృతి పట్ల సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. పేదరికంలో వున్న తెలంగాణ రచయితలు, కవుల బాగోగులను కనిపెట్టుకుంటూ, వారికి చేదోడువాదోడుగా వుంటూ, తెలంగాణ సాహిత్యం పట్ల వెంకటేశం కనబరిచిన ఆత్మీయతానుబంధం గొప్పదని కేసీఆర్ కొనియాడారు. వెంకటేశం మరణం సాహిత్య రంగానికి తీరని లోటని సీఎం అన్నారు. వెంకటేశం కుటుంబ సభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. నిజాం వెంకటేశం గుండెపోటుతో ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ అపోలో లో కన్నుమూసిన సంగతి తెలిసిందే. సుమారు 6 దశాబ్దాలుగా సాహిత్యంలోనే జీవిస్తూ, అదే శ్వాసిస్తూ అనేక ప్రముఖ గ్రంథాలను ప్రచురించారు. 80వ దశకంలో 'దిక్సూచి' అనే కవితా పత్రికను ప్రారంభించి ఎంతోమంది కొత్త, పాత కవులకు వేదికగా నిలిచారు. పుస్తకాన్ని అమితంగా ప్రేమించే ఆయన ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తూనే ప్రతినిత్యం గ్రంథాలను అన్వేషించేవారు. తనకు సాధ్యమైనంత వరకు కవులు, రచయితలకు చేదోడువాదోడుగా నిలిచేవారు.






# చలన చిత్రం

## వేద చిత్రం టీజర్ విడుదల




'ఈ సినిమా మోషన్ పోస్టర్, టీజర్ చాలా బాగుంది. టీజర్ చూస్తుంటే సినిమా హిట్ గ్యారెంటీ అనే నమ్మకం కలుగుతున్నది. హీరో చేనాగ్ స్క్రీన్ ప్రజెన్స్ ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు ప్రముఖ దర్శకుడు సుకుమార్. చేనాగ్, ప్రాచీ థాకర్ జంటగా జేడీ స్వామి దర్శకత్వంలో తెరకెక్కించిన 'వేద' చిత్ర టీజర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీత రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ 'దర్శకుడు జేడీ నా బాల్య మిత్రుడు. ఇద్దరం కలిసి చదువుకున్నాం. ఈ సినిమాలో నాలుగు పాటలు రాశాను. నా మిత్రుడు పరిశ్రమలో పెద్ద దర్శకుడిగా ఎదగాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'సైకో రొమాంటిక్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ సినిమాలో చూపించే అంశాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తాయి' అని దర్శకుడు పేర్కొన్నారు. ఏడుగురు నిర్మాతల భాగస్వామ్యంలో ఈ సినిమాను రూపొందించామని, ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌లో నటించడం ఆనందంగా ఉందని హీరో చేనాగ్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: అజయ్, సాహిత్యం: చంద్రబోస్, నిర్మాతలు: జె.సుధాకర్, శివ.బి, రాజీవ్ కుమార్, శ్రీనివాస్, రాజేందర్ కనుకుంట్ల, శ్రీధర్ అక్కినేని, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: జేడీ స్వామి.



## ఇందిరాగాంధీ పాత్రలో కంగనా అదుర్స్

ప్రముఖ నటి కంగనా రనౌత్ దర్శకత్వం వహిస్తున్న 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమాలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ పాత్రను కంగనా పోషించనుంది. ఈ మూవీలో ఆమె లుక్ కు సంబంధించి పోస్టర్ ను రిలీజ్ చేసినపుడు కంగనా, ఇందిరా లుక్ లో అదిరిపోయిందనే ప్రశంసలనూ అందుకుంది. అప్పట్నుంచి కంగనాను అందరూ ఇందిరా గాంధీ అని పిలుస్తున్నారట. అయితే ఈ విషయంపై స్పందించిన కంగనా.. తాజాగా తన చిన్ననాటి ఫొటోలను షేర్ చేసింది. తనను ఇప్పుడు ఇందిరా అని పిలుస్తున్నారు గానీ.. చిన్నతనంలోనే తనను తన బంధువులు ఇందిరా గాంధీ అని పిలిచేవారని చెప్పకొచ్చింది.

## శరవేగంగా బాలయ్య చిత్రం షూటింగ్

సంక్రాతికి విడుదల చేసేలా ప్రణాళిక

'అఖండ'తో మంచి విజయం అందుకున్న నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం అదే జోష్‌తో తన తదుపరి సినిమా షూటింగ్‌ను వేగంగా పూర్తి చేస్తున్నాడు. ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో పొలిటికల్ టచ్ ఉన్న మాస్ యాక్షన్ సినిమాను చేస్తున్నాడు. 'క్రాక్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత గోపిచంద్ మలినేని.. బాలకృష్ణతో సినిమా చేయనుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఇప్పటికే విడుదలైన బాలయ్య పోస్టర్‌లు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఎప్పుడెప్పుడు సినిమా విడుదలవుతుందా అని అభిమానులు ఎంతో క్యూరియాసిటీతో ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ చిత్రానికి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి భారీగా నాన్-థియేట్రికల్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తుంది. దాదాపు రూ.60 కోట్లకు ఈ సినిమా నాన్-థియేట్రికల్ హక్కులు అమ్ముడు పోయాయట. అఖండ సక్సెస్‌తో ఈ సినిమాకు భారీ రేంజ్‌లో బిజినెస్ జరగుతుందట. ఇక థియేట్రికల్ బిజినెస్ దాదాపు రూ.70 కోట్ల వరకు జరుగుతుందని మేకర్స్ భావిస్తున్నారు. ఇప్పటికే బయ్యర్ల నుండి ఫ్యాన్సీ రేటుతో ఆఫర్స్ వస్తున్నాయిట. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరపుకుంటున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరిలో రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. ఈ చిత్రంలో బాలకృష్ణకు జోడీగా శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తుంది. కన్నడ యాక్టర్ దునియా విజయ్ ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నాడు. ఎస్ఎస్. థమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ఈ సినిమాకు 'జై బాలయ్య' అనే టైటిల్ దాదాపు కన్ఫార్మ్ అయినట్లు తెలుస్తుంది. దీని తర్వాత బాలకృష్ణ, అనీల్ రావిపూడితో



## సినిమా ఎంపికలో శ్రీవిష్ణుకు మంచి అభిరుచి

అల్లూరి ప్రీ రిలీజ్ వేడుకల్లో అల్లు అర్జున్




'ఎవరికైనా అభిమానులుంటారు. నాకు ఆర్మీ ఉంది. నన్ను ప్రాణంగా ప్రేమించే నా ఆర్మీ.. ఐ లవ్ యూ' అని అల్లు అర్జున్అన్నారు. ఆయన మాటాలకు ఆ ప్రాంగణమంతా కేరింతలతో హోరెత్తిపోయింది. 'అల్లూరి' సినిమా ప్రీ రిలీజ్ వేడుక దీనికి వేదికైంది. శ్రీవిష్ణు హీరోగా ప్రదీప్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రమిది. బెక్కెం వేణుగోపాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకకు అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'నా మనసుకు దగ్గరైన అతి తక్కువమందిలో శ్రీవిష్ణు ఒకరు. ఆయన నటించిన ప్రతి సినిమా చూస్తాను. 'ప్రేమ ఇష్క్ కాదల్' సినిమాలో ముగ్గురు హీరోల్లో ఒకరిగా కనిపించినాతనదైన మార్క్ చూపించారు. అలా ఆయనపై అభిమానం మొదలైంది. కథల ఎంపికలో శ్రీవిష్ణుకి మంచి అభిరుచి ఉంది. డెడికేషన్‌తో పని చేసే ఆయన చిరత్రవ హిట్ అయినా కాకపోయినా గౌరవం ఒకేలా ఉంటుంది. 'పుష్ప 2' బిజీ వల్ల ఈవెంట్లకు రాకూడదనుకున్నా. ఓ రోజు విష్ణు నన్ను కలిసి.. 'నేను నా సినిమాలను పెద్దగా ప్రచారం చేసుకోవట్లేదని కామెంట్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని బాగా చేఏయాలనుంది. మీరు గెస్ట్‌గా వస్తే బాగుంటుంది' అని అడిగారు. కష్టపడి పనిచేసే నటుడికి ఈ మాత్రం చేయలేమా' అని ఇక్కడికి వచ్చాను' అని బన్నీ అన్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన ఫిక్షనల్ సినిమా ఇదని శ్రీవిష్ణు అన్నారు. పోలీసు వ్యవస్థ మనకెంతో సేవ చేస్తోంది. ఆ వ్యవస్థ కోసం ఏదైనా చేయాలనే ఆలోచన నుంచి వచ్చినదే ఈ చిత్రం. ఖాళీ చేతులతో ఇండస్ట్రీలో అడుగుపెట్టా. బెక్కెం వేణు గోపాల్ అప్పట్లో 'ప్రేమ ఇష్క్ కాదల్' అవకాశం ఇచ్చారు. అది నచ్చడంతో బన్నీగారు నన్ను పిలిచి కాసేపు మాట్లాడారు. 'శ్రీవిష్ణుగారూ మీరు బాగా నటించారు. మీకు చాలా అవకాశాలొస్తున్నాయని అనుకుంటున్నా. తొందరపడి ఏది పడితే అది చెయ్యకండి. రానున్న నాలుగేళ్లల్లో ఇండస్ట్రీ మారబోతుంది. కంటెంట్ ఉన్న సినిమాకే ఆదరణ ఉంటుంది. అలాంటి వాటినే ఎంపిక చేసుకోండి. లేదంటే ఖాళీగా ఉండండి' అని ఆయన అప్పుడు చెప్పిన మాటలను ఇప్పటికీ పాటిస్తున్నా. నేనేంటో నిరూపించుకుని ఆయన్ను కలవాలనుకున్నా. 'సన్నాఫ్ సత్యమూర్తి'లో చిన్న పాత్ర అవకాశం ఇచ్చారు. పట్టరాని ఆనందంలోనే చిత్రీకరణలో పాల్గొన్నా' అని శ్రీవిష్ణు అన్నారు.

## ఓటిటిలోకి వస్తోన్న ధనుష్ సారు మూవీ




గతేదాది 'కర్ణణ్'తో మొదటి సారి 50కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టిన ధనుష్.. ఈ ఏడాది 'తిరు'తో 100కోట్ల క్లబ్‌లో అడుగుపెట్టాడు. ఎలాంటి అంచనాల్లేకుండా గతనెల 18న విడుదలైన తిరు చిత్రం మొదటి రోజు నుండి పాజిటీవ్ టాక్ తెచ్చుకుని భారీ విజయం సాధించింది. ఓపెనింగ్స్ అంతగా రాకపోయిన రోజు రోజుకు ఈ సినిమాపై ఆదరణ పెరుగుతూ వచ్చింది. సినిమా విడుదలై నెల రోజులు దాటిన ఇంకా కలెక్షన్‌లు స్టడీగానే ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ చిత్రం దాదాపు రూ.120కోట్లకు పైగా గ్రాస్‌ను కలెక్ట్ చేసింది. ధనుష్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా 'తిరు' నిలిచింది. ఇదిలా ఉంటే ఈ సినిమా ఓటీటీ విడుదల కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓటీటీ రిలీజ్‌డేట్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'తిరు' చిత్రం సెప్టెంబర్ 23నుండి ప్రముఖ ఓటీటీ సంస్థ 'సన్ ఎన్ఎక్స్‌టీ'లో స్ట్రీమింగ్ కానుంది. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అందుబాటులో ఉండనుంది. ఈ చిత్రంతో ధనుష్‌కు సౌత్‌లో మంచి పాప్యులారిటీ వచ్చింది. రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించాడు. మ్యూజిక్ సెన్సేషన్ అనురుధ్ రవిచంద్రన్ ఈ చిత్రానికి సంగీతం అందించాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in